# ఏప్రిల్ ఫూల్



మార్చి ముప్పై ఒకటవ తేదీ సాయంత్రం అయిదు గంటల సమయం. డివిజనల్ ఆఫీసంతా కోలాహలంగా ఉంది. ఆ కోలాహలానికి కారణం పెద్ద గుమాస్తాకి, డివిజనల్ ఆఫీసరుకు, యూనియన్‌లో ఇంతో అంతో పేరున్న ఆచారిగారికి మాత్రమే తెలుసును. పెద్ద గుమాస్తా గారి చిరునవ్వు వెనక దాగిన దానికి ఏదో చిదంబర రహస్యం ఇరికి ఉంటుందని కుర్రగుమాస్తాలు ఊహాగానం చేస్తున్నారు. మెల్లగా ఆచారిగారి ద్వారా అసలు విషయం తెలిసిపోయింది, పెద్ద గుమాస్తాకి బదిలీ అయిపోయినట్టు, ఆ స్థానే ఇంకా ఎవరినీ వేయనట్టు, ఉన్న వారిలో సీనియర్ గుమాస్తాని హెడ్ క్లార్కు డ్యూటీ చేయమన్నట్టు.

"రేపు ఎలాగూ ఒకటవ తేదీ! అందరకూ జీతా లందుతాయి. అందరకూ ఇస్తున్నట్టుగానే పెద్ద గుమస్తాగారికి కూడా సకల లాంఛనాలతోనూ టీ పార్టీ ఇవ్వవలసిందే!" అన్న నిర్ణయానికి వచ్చారు సీనియర్ గుమాస్తాలు.

ఏప్రిల్ ఒకటవ తేదీ వచ్చింది. మధ్యాహ్నం రెండు గంటల సమయం. ఆచారిగారి ఆధ్వర్యంలో చక్కని టీ పార్టీ ఏర్పాటైంది. ఇటు సూపరింటెండెంటు గారు, అటు అసిస్టెంటు సూపరింటెండెంటుగారు, మధ్యను పెద్ద గుమాస్తా ఆసీనులై ఉన్నారు. ముసిముసి నవ్వులతో అందరూ స్వీట్ హాట్ కాఫీ సేవించారు.

"ఇన్నాళ్లు మనమధ్య మెలిగారు పెద్ద గుమాస్తాగారు. వీడ్కోలు సందర్భంగా ఎవరికి తోచినది వారు చెప్పండి" అన్నారు డివిజనల్ ఆఫీసరుగారు.

కొత్తగా డిపార్టుమెంటుకి వచ్చిన గుమాస్తా వరహాలరావు— "నే మాట్లాడతాను, సార్!" అంటూ గభీమని లేచి నిలుచున్నాడు.

'పట్టుమని రెండేళ్లు లేవు— ఎవరూ లేక డిస్పాచింగ్ సెక్షన్‌లోనికి తీసుకు వచ్చారు. ఆయనగారి గురించి ఈయనేం మాట్లాడగల'డని అంతా అనుకున్నారు. కాని, సిసింద్రీలా బల్ల గుద్దుతూ మాట్లాడడం మొదలు పెట్టాడు వరహాలరావు.

"వీడు వేలెడం తున్నాడు. వీడేం మాట్లాడతాడని కదూ అనుకుంటు న్నారు? ట్రాన్స్‌ఫర్ అయి వెళ్లేటప్పుడు చాలామంది పొగుడుతూ మాట్లాడతారు. అలా పొగడటం వలన మనం అవతలి వాళ్లను తప్పు తోవ తొక్కిస్తున్నామన్న మాట! కాబట్టి చేసిన తప్పుల్ని ఇలాంటి వీడ్కోలు సందర్భంలోనే ముఖం వాచి నట్టు విప్పి చెప్పాలి. అలా అయితేనే పశ్చాత్తాప హృదయంతో మరో చోటికి పోయి తప్పులు దిద్దుకుని మంచి మార్గ మవలంబిస్తారు. అయ్యగారు ఎప్పుడూ విభూది ధరిస్తారు. రామా, కృష్ణా అంటారు. మీటింగుల్లో ఒక్క భగవద్గీత లోని శ్లోకమే కాదు, ముస్లిమ్‌ల మెప్పు పొందటానికి ఖురాన్‌లో కొన్ని వాక్యాలు, క్రిస్టియన్‌ల అభిమానం పొందటానికి బైబిల్‌లో కొన్ని సూక్తులు చెపుతుంటారు. ఇన్ని మతాలను ఇంత అభిమానంతో ఆరాధించేవారు ఎట్లాంటి వారై ఉండాలంటారు? బుద్ధభగవానుని వంటివా డనాలి. కాని, కొన్ని ఘట్టాలు తీసుకుంటే నమ్మ శక్యం కాకుండా ఉంటుంది. మా ఊరి ఆఫీసులో పాతిక రూపాయలకు పొద్దుట, సాయంత్రం ఆఫీసు సంచులు మోసే సూరప్ప దున్నా డన్న సంగతి అందరకూ తెలియదు.

—అప్పాజీ

ఏప్రిల్ ఫూల్ అనేది సరదాకోసం జరిపే సంప్రదాయం కాని, ఆ ఆచరణలో దాగిన కొన్ని పచ్చి నిజాలు బయటపడి, చేదామనుకొన్న ఏప్రిల్ ఫూల్ నిజమై కూర్చుంటే...

కారణం— వాడు పాతిక రూపాయల జీతగాడు కాబట్టి చీమతో సమానం. గుర్తు పెట్టుకో వలసిన అవసరం ఎవరికీ లేదు. ఒక రోజు ఏమయిందో తెలుసా? మాస్టారుగారు చెప్పిన పని త్వరగా చెయ్యలేదని సూరప్పడుకు శిక్ష విధించారు మాస్టారుగారు. ఆ శిక్ష ఎలాంటిదో చూడండి. సంచిలో పది కేజీల ఇనప గుండు అదనంగా వేసి కట్టి అవతలి మాస్టారుకు జాబు రాసి తిరుగు సంచిలో కూడా అదే గుండు పంపమని. అది శిక్షట! ఒక పూట తృప్తిగా తిన నోచుకోలేని పాతిక రూపాయల జీతగాడికి భగవత్‌భక్తుడువిధించిన శిక్ష. సూరప్పడు బరువు మోసి తాత్కాలికంగా శిక్ష అనుభవించాడు. కాని, అది శాశ్వతంగా పాపపుశిక్షగా ఎవరి పద్దులో లిఖించబడుతుందో తెలిసిన వారికి తెలుస్తుంది. అదే వ్యక్తి అదే ఊరిలో ఇల్లు కట్టడానికి మొదలుపెట్టారు. కూలీలను పెడితే కావలసినంత ఖర్చయిపోతుంది. అందుకని పాతిక రూపాయల జీతగాళ్లను, అణకువగా ఉన్న వారిని అదుపులో పెట్టుకుని డ్యూటీ అయిన తరవాత విధిగా వచ్చి ఇటుకలు, రాళ్లు, సున్నం, నీరు ఎత్తి పెద్ద మేస్త్రీల కివ్వాలన్న ఏర్పాట్లు చేసుకున్నాడు. ఎక్కడ ఉద్యోగం ఊడగొడతారో అన్న భయంతో ఆ బానిసలు సహాయం చేసేవారు. సూరప్పడుకూడా చేసేవాడో, మానేవాడో? ఆకలితో రాలేకపోయాడు. శక్తిలేక, నడవలేక రాలేకపోయాడు. ఇంతలో సూరప్పడు భార్యకు పెద్దపేగు క్యాన్సర్ వ్యాధి లక్షణాలు కనిపించాయి. కంపించిపోయాడు. పిల్లలూ, తానూ వేయి దేవుళ్లకు మొక్కుకున్నారు. ఇటుకల మోత పనికి రాలేదని అయ్యగారు మండిపోతున్నారు. అడకత్తెరలో పోక చెక్కను నలిపినట్టు నలపాలనుకున్నారు.

ఇన్‌స్పెక్టర్‌గారు రాగానే సూరప్పడి గురించి లేనిపోని చాడీలు చెప్పారు కాని, ఇన్‌స్పెక్టరుగారు చాలా మంచివారు. అంత సులువుగా నమ్మలేదు. 'వాళ్ల కిచ్చేదే పాతిక—ఎందుకంటే వాళ్ల నట్లా కాల్చుకు తింటా'రని మందలించారు. మాస్టారుగారు లోలోన మండిపోయారు. ఎలాగైనా పాతాళానికి అణగతొక్కాలనుకున్నారు.

'సూరప్పడూ! నీకు ఏదైనా సహాయం చేయాలనుకుంటున్నానోయ్! చిన్న ఉద్యోగంలో తక్కువ జీతంతో ఎన్నాళ్లని బాధలు పడతావు? ఇంతకన్న మంచి ఉద్యోగంలో చేరాలంటే ఎనిమిదవ తరగతి పాసైనట్టు స్కూలు సర్టిఫికేట్ ఉండాలి. దానికి కావలిస్తే రెండో మూడో నేనిస్తాను. తీసుకువెళ్లి సర్టిఫికేట్ సంపాదించుకు రా. నే సది డివిజనల్ ఆఫీసుకు పంపిస్తాను. తప్పక నిన్ను నాలుగవ తరగతి ఉద్యోగస్థుడుగా తీసుకుంటారు' అన్నారు.

మరణ శయ్యమీద ఉన్న భార్యకు తెలియకుండా చిల్లులు పడ్డ ఇత్తడి బిందెను అయిదు రూపాయలకు తాకట్టు పెట్టి ఆ డబ్బుతో సర్టిఫికేట్ సంపాదించుకు వచ్చాడు. తప్పక తగిన సహాయం చేస్తానని సూరప్పడి స్వహస్తాలతో అప్లికేషన్ రాయించి తీసుకున్నారు. సూరప్పడి పీక తన చేతిలో చిక్కిందని మాస్టారుగారు మురిసిపోయారు. అయిదో తరగతి పోగొట్టుకున్న సర్టిఫికేట్ కూడా మాస్టారుగారి దగ్గర ఏదో సందర్భంలో ఉంచవలసి వచ్చింది. రెండూ జోడించి ఇదే ఆఫీసుకు రెండేళ్ల క్రితం పంపడం, సూరప్పడి ఉద్యోగం ఊడిపోవడం జరిగింది. పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వేశారు. పాతిక రూపాయల జీతగాడికి ఎంత శిక్ష విధించారో చూడండి'' అంటూ వరహాలరావు ఏడుస్తున్నాడు.

''సూరప్పడు మరెవరో కాదండీ! మా అక్క భర్త. ఆమె క్యాన్సర్‌తో చనిపోయింది. ముగ్గురు పిల్లలు. సూరప్పడు కూలి చేసుకుంటున్నాడు. నేను మంచి మార్కులతో పాసయాను. గుమాస్తాగా రాగలిగాను. నా జీతంతో ఆ ముగ్గురి పిల్లల్ని పెద్దవాళ్లను చేస్తాను. జీవితాంతం బ్రహ్మచారిగానే ఉండిపోతాను. అయ్యా, సూపరింటెండెంటుగారూ! తమ దగ్గర నే నెంత వాడిని? తలుచుకుంటే ఏమైనా చెయ్యగలరు! ఏ కలంతో శిక్షించగలరో, అదే కలంతో రక్షించ గలరుకూడా! ఇంత బాధతో ఎందుకు చెప్పానంటే మనిషి మరో మనిషికి వీలైతే సహాయం చేయాలి. కాని, కావాలని అపకారం తలపెట్టకూడదు. అదే వ్యక్తి ప్రొమోషన్‌లో ఒకటిన్నర సంవత్సరాల క్రితం ఈ ఆఫీసుకు వచ్చారు. ఆత్మ పరీక్ష చేసుకుని మిగిలిన జీవితం ఒకరికి సహాయం చేయటానికి వినియోగించటం మంచిది'' అని కూర్చుని కళ్లు తుడుచుకుంటున్నాడు. మధ్య కుర్చీలో ఉన్న పెద్ద గుమాస్తా ముఖాన్ని చిక్కితే నెత్తురు లేదు. సూరప్పడుకూ, వరహాలరావుకూ ఉన్న బాంధవ్యం అంతవరకూ ఎవరికీ తెలియదు. ఎవరూ ఏమీ అనలేకపోయారు. ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్నారు.

సూపరింటెండెంటుగారు చిరునవ్వుతో లేచి, ''చూడండి! ఈవేళ ఏప్రిల్ ఒకటవ తేదీ. నిన్న మీ హెడ్‌క్లార్కుగారు నా వద్దకు వచ్చి తనకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు వచ్చినట్టు పుకారు లేవతీయమన్నారు. నేనుకూడా ఏప్రిల్ ఫస్టు కనక అబద్ధం ఆడినా తప్పు లేదని చిన్ననాటి విషయాలు, ఆటలు గుర్తుకు తెచ్చుకుని ఆచారి గారితో మెల్లగా మాట్లాడి ఈ నాటక మాడాము. మీ రందరూ పార్టీ ఇచ్చారు. సరదాగా నాలుగు కబుర్లు చెప్పాక హెడ్‌క్లార్కు లేచి, 'అంతా వట్టిదేనండీ! మిమ్మల్ని ఏప్రిల్ ఫూల్ చేశా'మని చెపుదామనుకున్నారు. కాని కథ అడ్డం తిరిగింది. వరహాలరావు కడుపులో ఉన్న కోపాన్ని వెళ్లగక్కాడు. తక్కినవాళ్లకు మాట్లాడేందుకు అవకాశమిస్తే ఈ పార్టీ ఈ వేళ ముగియదు. ఈ పరిస్థితుల్లో హెడ్‌క్లార్కుగారిని ఈ ఆఫీసులో ఉంచితే మరికొన్ని తగాదాలు రావచ్చు. అందుకని పై అధికారులతో మాట్లాడి మరో ఊరు నిజంగానే ట్రాన్స్‌ఫర్ చేయిస్తాను. ఈవేళటినుంచీ ఒక నెల సెలవు కూడా మంజూరు చేస్తున్నాను. ఆయన సీటులో ఆచారిగారిని తాత్కాలికంగా అపాయింట్ చేస్తున్నాను. . . పార్టీ ముగించే ముందు చిన్న సూచన: వరహాలరావు చెప్పిన హృదయవిదారకమైన పాతిక రూపాయల జీతగాడి కన్నీటి కథ నా కెంతో కష్టం కలిగించింది. మూర్తిగారు ఇకనుంచి ఉపకార బుద్ధితో మసులుకుంటారని ఆశిద్దాం. ఈ ఏప్రిల్ ఫస్టు కొత్త తరహాగా నడిచింది'' అన్నారు. వరహాలరావు సీట్లో కూర్చుని కండ్లు తుడుచుకుంటున్నాడు. ★



ఎంత వయసో

ఫోటో — ఎమ్. రంగారావు (వాల్తేరు)